సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



టన్ను చీనీ రూ.16 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16 వేలు, కనిష్టంగా రూ.7 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.18
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.18, కనిష్టంగా రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.1°/20.6°
జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

29 మండలాల్లో వర్షం



పుట్టపర్తి అర్బన్: తుపాను ప్రభావంతో గురువారం కూడా జిల్లాలోని 29 మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. చిలమత్తూరు మండలంలో 87.2 మి.మీ., లేపాక్షి 70.2, హిందూపురం 48.6, ఓడీ చెరువు 48.4, గాండ్లపెంట 42, నల్లచెరువు 34.2, ఎన్పీ కుంట 32.2, గోరంట్ల 32.2, ముదిగుబ్బ 26.4, పరిగి 26.2 మి.మీ వర్షం కురిసిందన్నారు. అలాగే కదిరిలో 22 మి.మీ., రొళ్ల 16.4, తనకల్లు 15.8, అమడగూరు 15.2, బుక్కపట్నం 15, కొత్తచెరువు 12, నల్లమాడ 9.8, అగళి 9.6, తలుపుల 8.4, మడకశిర 6.8, పుట్టపర్తి 6.4, పెనుకొండ 5.4, సోమందేపల్లి 4.8, సీకే పల్లి 4.6, అమరాపురం 3.8, ధర్మవరం 3.4, గుడిబండ 2.6, తాడిమర్రి 2.2, రొద్దంలో 1.6 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. జిల్లాలో మొత్తం 613.4 మి.మీ వర్షం కురిసిందని వెల్లడించారు. తుపాను ప్రభావం మరో రెండు రోజులు ఉంటుందన్నారు.

విష జ్వరంతో విద్యార్థి మృతి



మృతుడు షేక్ మహమ్మద్ షాహీద్

ముదిగుబ్బ: ముదిగుబ్బ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న షేక్ మహమ్మద్ షాహీద్ (13) విషజ్వరంతో గురువారం మృతి చెందినట్లు ప్రధానోపాధ్యాయుడు రాఘవ తెలిపారు. షాహీద్ నెలరోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడని, చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయిందని తండ్రి బాబ్ జాన్ కన్నీటి పర్యంతమయ్యారు. విష జ్వరంతో చనిపోయాడా? లేక డెంగీ లక్షణాలు ఉన్నాయా అని వైద్య సిబ్బంది ఆరా తీస్తున్నారు. విద్యార్థి మృతికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు.

నలుగురికి రిమాండ్

కదిరి అర్బన్: గత నెల 27న కుటాగుళ్ల గ్రామంలో జరిగిన పరస్పర దాడులకు సంబంధించి నమోదైన కేసులో నలుగురిని గురువారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. గొడవల అనంతరం ఆస్పత్రిలో వైద్యులపై దాడులకు పాల్పడిన ఘటనలో 3 కేసులు నమోదు చేసినట్లు వివరించారు. మొత్తం 12 మందిపై కేసులు నమోదు చేయగా, గతంలోనే 8 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామని, తాజాగా నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

బార్ టెండర్లలో సిండికేటు




సాక్షి, పుట్టపర్తి: నూతన మద్యం పాలసీ ద్వారా బార్‌లకు లైసెన్సులు ఇచ్చి.. మరింత ఆదాయం పెంచాలని భావించిన కూటమి సర్కారుకు ఎదురు దెబ్బ తగిలింది. ప్రభుత్వ ఆదాయానికి గండి పడేలా కూటమి పార్టీల నాయకులు సిండికేటుగా మారి దరఖాస్తులు వేయనీయకుండా అడ్డుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో మొత్తం 12 బార్ లకు నోటిఫికేషన్ విడుదల చేయగా.. తొలివిడతలో ఏడింటికి దరఖాస్తులు వచ్చాయి. లాటరీ పద్ధతిన గడిచిన నెలలో బార్లు కేటాయించారు. పెండింగులో ఉన్న మిగతా వాటికి రెండో విడత నోటిఫికేషన్ విడుదల చేశారు. మరో మూడు బార్‌లకు మాత్రమే పరిమితంగా దరఖాస్తులు వచ్చాయి. ఇంకో రెండు బార్‌లకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. మరోసారి నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. రెండో విడత నోటిఫికేషన్‌లో మూడు బార్లను కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్యాంప్రసాద్ చేతుల మీదుగా గురువారం లాటరీ తీసి ఎంపిక చేశారు. .

ఒక్కో వ్యక్తి నాలుగు సెట్లు..

హిందూపురంలోని బార్‌కు ఒక్క వ్యక్తే నాలుగు సెట్లు దాఖలు చేశాడు. దీంతో ఆయన్నే ఎంపిక చేశారు. అలాగే మడకశిరలోనూ ఒకే వ్యక్తి నాలుగు సెట్లు దరఖాస్తులు చేయడం విశేషం. కదిరిలోని బార్‌కు ఒక వ్యక్తి మూడు సెట్‌లు, మరో వ్యక్తి ఒక సెట్ దాఖలు చేయగా.. సక్సెస్‌ఫుల్ అప్లికెంట్‌గా ఒకరు.. ఆర్1గా ఇంకొకరికి అవకాశం లభించింది. ధర్మవరంలోని రెండు బార్‌లకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. అయితే గతంలో జిల్లాలో 9 బార్లు మాత్రమే ఉండేవి. ఈసారి ఇప్పటికే 10 బార్‌లు వెలిశాయి. ఇంకో రెండు పెండింగులో ఉన్నాయి. అయితే అన్ని చోట్ల సిండికేటుగా మారడంతో అందరూ కలిసే దరఖాస్తులు వేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా నాలుగు కంటే తక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ రద్దు చేస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్ తెలిపారు. సరిపడా దరఖాస్తులు రాని రెండు బార్‌లకు మరోసారి రీనోటిఫికేషన్ ఇస్తామన్నారు.

శత ఉత్సవం.. నిర్లక్ష్యం

- సత్యసాయి శతజయంతి ఉత్సవాలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఉత్సవాలకు రెండు నెలలే గడువు
- మౌలిక వసతులపై దృష్టిసారించని వైనం
- రూ.25 కోట్లు అడిగితే రూ.3.10 కోట్లు మాత్రమే మంజూరు
- ప్రభుత్వ తీరుపై భక్తుల అసంతృప్తి



ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు సత్యసాయి శత జయంతి ఉత్సవాల కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ కూడా ఎంతో ప్రతిష్టాత్మకంగా వేడుకలను చేయాలని చర్యలు చేపట్టింది. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం బాబా శత జయంతి ఉత్సవాలను నిర్లక్ష్యం చేస్తోంది. ఉత్సవాలకు కేవలం రెండు నెలలే గడువున్నా నేటికీ మౌలిక సదుపాయల కల్పనపై దృష్టిసారించలేదు. రూ.25 కోట్ల నిధులు అవసరమని నివేదికలు పంపితే కేవలం రూ.3.10 కోట్లు మాత్రమే మంజూరు చేసింది.



చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండిన చిత్రావతి నది



అర్ధాంతరంగా ఆగిపోయిన వాటర్ ట్యాంక్ పనులు

పుట్టపర్తి అర్బన్: ఇప్పటి వరకూ జరిగిన సత్యసాయి జయంతి వేడుకలు ఒక ఎత్తు అయితే ఈ సారి జరిగే శత జయంతి వేడుకలు మరో ఎత్తు. వందో జయంతి వేడుకలు అవడంతో 139 దేశాలకు చెందిన భక్తులతో పాటు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి భక్తులు, భజన మండళ్ల నుంచి లక్షలాది మంది తరలిరానున్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ కూడా అందుకు తగ్గట్టుగానే ఏర్పాట్లలో నిమగ్నమవైంది. ఇప్పటికే సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ భవనాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, మ్యూజియం, ఇతర ఆలయాలు, ఆర్చ్‌లకు పెయింటింగ్ పనులు పూర్తి చేసింది. వసతి కోసం అధునాతన భవంతులు నిర్మిస్తోంది. ఇంత పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించడానికి పుట్టపర్తి ముస్తాబవుతుంటే కూటమి ప్రభుత్వం మొద్దు నిద్రను వీడటం లేదు.

గుంతలమయంగానే రోడ్లు..

ఇటీవల కురిసిన వర్షాలకు పుట్టపర్తిలోని రోడ్లన్నీ పాడైపోయాయి. ఎక్కడ చూసినా గుంతల మయమయ్యాయి. రోడ్ల మరమ్మతు విషయంలోనూ కూటమి ప్రభుత్వం వెనుకడుగు వేస్తోంది. ముఖ్యంగా వీఐపీలు, వీవీఐపీలు మందిరంలోకి వెళ్లే వెస్ట్ గేట్ రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. విమానాశ్రయం నుంచి లోనికి వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో పాటు బ్రాహ్మణపల్లి, బీడుపల్లి రోడ్లు, పెద్ద కమ్మవారిపల్లి రోడ్డు, దెబ్బతిన్నాయి. అలాగే సాయినగర్ మీదుగా వేసిన రింగ్ రోడ్డు అర్ధాంతరంగా ఆగిపోయింది. పట్టణంలో ఆటోలు నిత్యం రోడ్లపైనే ఉండడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలోకి వచ్చే వేలాది వాహనాలకు పార్కింగ్ పెద్ద సమస్య కానుంది. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేస్తే భక్తులు ఇబ్బంది పడతారు. ఇప్పటికే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా పోలీసులు కూడా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.



మందిరంలోకి వీవీఐపీలు వెళ్లే వెస్ట్ గేట్ రోడ్డు దుస్థితి

నామమాత్రంగా నిధుల మంజూరు..

శత జయంతి వేడుకల ఏర్పాట్ల కోసం రూ.25 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి అధికారులు నివేదిక పంపారు. అయితే కూటమి ప్రభుత్వం కేవలం రూ.3.10 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. ఇందులో ప్రభుత్వ నిధులు రూ.2 కోట్లు, కలెక్టర్ నుంచి రూ.75 లక్షలు, 'పుడా' ద్వారా రూ.35 లక్షలు మంజూరయ్యాయి.

వసతికి కష్టమే..

సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు ఇప్పటి నుంచే వసతి కోసం హోటళ్లు, లాడ్జిల యజమానులను సంప్రదించి ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారు. పుట్టపర్తి జిల్లా కేంద్రమైన తర్వాత అధికారులు, సిబ్బంది చాలా వరకూ పుట్టపర్తిలోనే వసతి గదులు ఏర్పాటు చేసుకున్నారు. వచ్చే భక్తులు కనీసం వారం రోజులు ఉండాలంటే ఎన్నో వ్యయప్రయాసల కోర్చాల్సి పరిస్థితి.

నీటి సమస్యను పరిష్కరించేరా?

అపర భగీరథుడిగా పేరొందిన సత్యసాయి బాబా నివసించిన పుట్టపర్తిలోనే తాగునీటి సమస్య పట్టిపీడిస్తోంది. నిత్యం ఏదో ఒక వీధిలో నీళ్లు రాలేదని స్థానికులు నిరసనలకు దిగుతున్నారు.ఈ నేపథ్యంలో శత జయంతి వేడుకలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు నీటిని అందించగలరా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పట్టణంలో చేపట్టిన ఇంటింటికీ కొళాయి పథకం వాటర్ ట్యాంకుల నిర్మాణంలోనే ఉంది.

ఎక్కడ చూసినా చెత్తా చెదారం..

పట్టణంలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఎప్పుడు పొంగుతుందో తెలియని పరిస్థితి. ఒక చోట బాగు చేస్తే మరో చోట పొంగుతోంది. డ్రైనేజీ నీరంతా చిత్రవతి నదిలో పోతోందని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పర్యాటకులను ఆకర్షించడానికి చిత్రావతిలో ఏర్పాటు చేసిన బోటింగ్ సమీపంలోనే చెత్తా చెదారంతో కంపు కొడుతోంది. కనీసం దీన్ని శుభ్రం కూడా చేయలేకపోతున్నారు. చిత్రావతి నదికి ఇరువైపులా బండింగ్ చేయిస్తాం, బాబా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం, ఫౌంటెన్లు ఏర్పాటు చేస్తామని ఆర్భాటంగా ప్రకటనలు చేశారు తప్ప ఏదీ జరగలేదు. నదికి ఇరువైపులా చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు, ముళ్లకంపలతో నిండిపోయింది. కర్ణాటక నాగేపల్లి బ్రిడ్జికి కింది భాగంలో ఇసుక కోసం విపరీతంగా గుంతలు తీశారు. పెద్ద సంఖ్యలో భక్తుల రాక నేపథ్యంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

మరుగుదొడ్లు శిథిలం

పుట్టపర్తిలో నిత్యం విద్యుత్ కోతలతో భక్తులతో పాటు పట్టణ వాసులు కూడా అల్లాడిపోతున్నారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయకపోతే ఇబ్బందులు అధికం కానున్నాయి. ఉన్న హైమాస్ లైట్లు కూడా వెలగడం లేదని, కొత్తవి ఎప్పుడు ఏర్పాటు చేస్తారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. అలాగే పట్టణానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎక్కడా వంద మందికి అవసరమైన మరుగుదొడ్లు లేవు. తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసినా ఇబ్బందులు తప్పవు. గతంలో నిర్మించిన శాశ్వత మరుగుదొడ్లు నిర్వహణా లోపంతో శిథిలమయ్యాయి. మహిళలు, పిల్లలు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.



నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు



పెండింగ్ పనులను పూర్తి చేయాలి

పుట్టపర్తిలో ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేయాలి. రింగ్ రోడ్డు, తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి సత్యసాయి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలి. అంచనాలకు తగినట్లు సౌకర్యాలు కల్పించకపోతే ప్రపంచ వ్యాప్తంగా పుట్టపర్తి పరువు పోతుంది. – నరసింహులు, పుట్టపర్తి



నిధులు తెచ్చేదెన్నడో?

సత్యసాయి బాబా శత జయంతి వేడుకలకు పూర్తి స్థాయిలో నిధులు తీసుకురాలేకపోతున్నారు. ఇంత వరకూ గంపెడు మట్టి కూడా రోడ్లపై వేయలేకపోయారు. పుట్టపర్తిపై కూటమి నాయకులకు శ్రద్ధలేదు. ఇప్పుడైనా పనులు ప్రారంభించాలి. – మాధవరెడ్డి, పుట్టపర్తి



'కూటమి' మొద్దు నిద్ర వీడాలి

సత్యసాయి శత జయంతి ఉత్సవాలపై కూటమి ప్రభుత్వం మాత్రం మొద్దునిద్ర వీడటం లేదు. లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు మౌలిక వసతులు కల్పించాలి. నేటికీ ఏ పనులు సక్రమంగా జరగడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలి. – దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పుట్టపర్తి



పనులు ప్రారంభిస్తాం

సత్యసాయిబాబా శత జయంతి వేడుకల కోసం ఇప్పటి వరకూ రూ.3.10 కోట్లు మంజూరయ్యాయి. త్వరలోనే పనులను ప్రారంభిస్తాం. రెండు మాసాల్లో పనులు పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. – క్రాంతి కుమార్, మున్సిపల్ కమిషనర్, పుట్టపర్తి

ఆశగా రప్పించి.. నిరాశతో తిప్పి పంపించి



గురువారం ఉదయమే పీవీకేకే కళాశాల వద్దకు చేరుకున్న డీఎస్సీ అభ్యర్థులు, వారి బంధువులు

- కొత్త టీచర్లకు నియామక పత్రాల అందజేత వాయిదా
- బస్సుల్లో కూర్చున్న తర్వాత ప్రకటించిన వైనం

పుట్టపర్తి: గుంటూరులో శుక్రవారం జరగాల్సిన డీఎస్సీ–25 కొత్త టీచర్ల నియామకపత్రాల అందజేత కార్యక్రమం వాయిదా పడింది. ముందెన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం ప్రచార యావ కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలోని 750 మంది అభ్యర్థుల కోసం 45 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఒక అభ్యర్థికి తోడుగా మరో కుటుంబ సభ్యుడు కచ్చితంగా రావాల్సిందేనంటూ చెప్పారు. ఈ క్రమంలో కొందరు అభ్యర్థుల కుటుంబ సభ్యులు తమకు వీలుకాదని, అనారోగ్యంగా ఉన్నామని వేడుకున్నా కనికరించలేదు. ఉద్యోగం కావాలంటే తప్పదని స్పష్టం చేశారు. గురువారం ఉదయం 6 గంటలకు అనంతపురం రూరల్ ఆలమూరు రోడ్డులోని పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకోవాలని సూచించారు. ఇక్కడికి చేరుకోవడానికి అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు తీవ్ర అవస్థలు పడ్డారు. అనారోగ్యంగా ఉన్నవారు సైతం రాత్రికి రాత్రే ఇక్కడికి చేరుకున్నారు. మరికొందరు ఉదయాన్నే వచ్చారు. అక్కడ 45 బస్సులు సిద్ధం చేశారు. ప్రతి బస్సుకు నలుగురు లైజన్ ఆఫీసర్లను నియమించారు. అల్పాహారం సిద్ధం చేశారు. తిని బస్సుల్లో ఎక్కి కూర్చున్నారు. ఈ సమయంలో వర్షాల కారణంగా కార్యక్రమం వాయిదా వేస్తున్నట్లు డైరెక్టరేట్ నుంచి డీఈఓకు సమాచారం అందడంతో ఆ మేరకు డీఈఓ ప్రసాద్ బాబు అధికారికంగా ప్రకటించారు. ముందుచూపు లేకుండా ఇలాంటి కార్యక్రమం ఎలా ఏర్పాటు చేశారని పలువురు అభ్యర్థులు మండిపడ్డారు. వాతావరణ శాఖ నుంచి కనీస సమాచారం తీసుకోకుండా కార్యక్రమం ఎలా ఏర్పాటు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చౌకబారు రాజకీయాలు మానుకో..

మంత్రి సవితకు ఎమ్మెల్సీ మంగమ్మ హితవు

అనంతపురం కార్పొరేషన్: వైద్య కళాశాలను ప్రైవేటీకరణ చేయాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వైఎస్సార్‌సీపీ తప్పుబడితే మంత్రి సవిత చౌకబారు రాజకీయాలకు తెరలేపడం సిగ్గుచేటని ఎమ్మెల్సీ మంగమ్మ మండిపడ్డారు. చౌకబారు రాజకీయాలు మానుకోవాలని మంత్రికి హితవు పలికారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలోని పేద పిల్లలకు వైద్య విద్యను అందుబాటులో తీసుకువచ్చేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెనుకొండలో వైద్య కళాశాల ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 17 వైద్య కళాశాలలకు వైఎస్సార్‌సీపీ హయాంలో అనుమతులు వచ్చాయన్నారు. ఈ కళాశాలలు పూర్తయి పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య చేరువైతే వైఎస్ జగన్‌కు మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా ప్రైవేటీకరణకు పాల్పడుతోందని విమర్శించారు. ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సైతం చేష్టలుడిగి చూస్తున్నారని, రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

ప్రైవేటీకరణం

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వైఎస్సార్‌సీపీ నిరసన బాట
- నేడు 'చలో మెడికల్ కాలేజీ'కి పిలుపు
- విజయవంతం చేయాలని మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపు



పెనుకొండ సమీపంలో నిర్మాణ దశలో ఆగిపోయిన మెడికల్ కళాశాల

పెనుకొండ రూరల్/పరిగి: వైద్యో నారాయణో హరి అన్నారు. ఆపద సమయంలో ప్రాణం పోసే వాడు దేవుడితో సమానం. అందుకే పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలన్న ఏకైక లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి అంకురార్పణ చేశారు. ఇందులో భాగంగానే పెనుకొండ పట్టణం సమీపంలో 63 ఎకరాల్లో రూ.470 కోట్ల అంచనాలతో మెడికల్ కాలేజీ నిర్మాణానికి 2021 మే 31న శంకుస్థాపన చేశారు. మెడికల్ కళాశాలతో పాటు అన్ని వసతులతో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల వివిధ అభివృద్ధి పనులకు అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కళాశాల భవన నిర్మాణాల కోసం దాదాపు రూ.30 కోట్లు ఖర్చు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఏడాదిన్నర కాలంలోనే నిరుపేదలకు వైద్య సేవలను దూరం చేసింది. మెరుగైన వైద్య సదుపాయాలతో పాటు నిరుపేద విద్యార్థులకు వైద్య విద్యను అందించాలన్న లక్ష్యాన్ని నీరు గారుస్తోంది. మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించడంతో పేద విద్యార్థులకు తీరని అన్యాయం జరగనుంది. తొలివిడతలో 5 కాలేజీలను ప్రైవేటుపరం చేసింది. మలివిడతలో పెనుకొండ మెడికల్ కాలేజీని కూడా ప్రైవేటుపరం చేసేందుకు సిద్ధమైంది.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

నేడు వైఎస్సార్‌సీపీ 'చలో మెడికల్ కాలేజీ'

పీపీపీ విధానాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆందోళన బాట పట్టింది. ఇందులో భాగంగానే శుక్రవారం చలో మెడికల్ కాలేజీకి పిలుపునిచ్చింది. ఉదయం 9–30 గంటలకు పెనుకొండ పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి చేరుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన నలభై ఏళ్ల రాజకీయ జీవిత కాలంలో ఏనాడూ ప్రభుత్వ అనుకూల వ్యవస్థలను ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఎలాంటి వ్యవస్థనైనా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టి, తన స్వార్థ ప్రయోజనాలకే రాష్ట్రాభివృద్ధిని తాకట్టుపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ శుక్రవారం పెనుకొండలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువత అధ్యక్షుడు జక్కంపూడి రాజాతో పాటు పలువురు కోఆర్డినేటర్లు విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు, రేపు దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

పుట్టపర్తి టౌన్: రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన విధానాలతో ఇబ్బంది పడుతున్న దస్తావేజు లేఖరులు శుక్ర , శనివారాల్లో పెన్‌డౌన్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. గురువారం దస్తావేజు లేఖరులు మాట్లాడుతూ.. ఆధార్ ఓటీపీ, స్థానిక సంస్థల డేటా ఆధారంగా ఇంటి ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రూపొందించిన సాఫ్ట్‌వేర్‌తో విలువైన సమయం వృథా అవుతోందన్నారు. ఈ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ శుక్ర, శనివారం రెండు రోజులపాటు దస్తావేజు లేఖరులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. ఇందుకు సంబంధించిన నోటీసును సబ్ రిజిస్ట్రార్ రామ్మోహన్‌కు అందజేశారు.



నిరసన కార్యక్రమంపై సబ్ రిజిస్ట్రార్‌కు నోటీసు ఇస్తున్న దస్తావేజు లేఖరులు

క్లుప్తంగా

తాటిమానుగుంతలో వైద్య శిబిరం



జ్వరాలపై ఇంటింటా సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఎన్పీకుంట: మండలంలోని తాటిమానుగుంత గ్రామంలో మండల వైద్యాధికారి డాక్టర్ బాలాజీనాయక్ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 'వణికిస్తున్న జ్వరాలు' శీర్షికన 'సాక్షి'లో గురువారం వెలువడిన కథనంపై వైద్యాధికారులు స్పందించి గ్రామంలో ఇంటింటా సర్వే చేపట్టి జ్వర పీడితులను గుర్తించారు. అనంతరం అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నాగలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ మహేశ్వరరెడ్డి, ఆరోగ్య కార్యకర్త రమేష్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సెల్ఫీ వీడియో తీసుకుని రైతు ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్: తన భూ సమస్యను పరిష్కరించాలని అనేక సార్లు అధికారులకు తెలిపినా ఫలితం దక్కడం లేదంటూ ఓ రైతు గురువారం ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అంతకుముందు తన బాధను సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్టు వైరల్ అయింది. బాధితుడి తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లుకు చెందిన రైతు బొమ్మయ్యకు గ్రామ సమీపంలోని కొండ వద్ద పొలం ఉంది. ఇటీవల కొండలో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు తవ్వకాలు మొదలుపెట్టారు. ఇష్టారాజ్యంగా బ్లాస్టింగ్లు చేపట్టారు. ఈ క్రమంలో రాళ్లన్నీ ఎగిరి బొమ్మయ్య పొలంలో పడుతున్నాయి. కళ్యాణదుర్గం టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ గోవిందప్పకు చెందిన కంకర మిషన్కు టిప్పర్లతో రాళ్లను తరలిస్తున్నారు. దీంతో పొలంలోని పంట నాశనమవుతోంది. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించ లేదు. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన బొమ్మయ్య గురువారం అదే కొండపైకి ఎక్కి తన బాధనంతా సెల్ఫీ వీడియోలో వివరించి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే గుర్తించిన స్థానికులు అప్రమత్తమై రైతును కాపాడారు.


రైతు భూమయ్య

కూటమిపై పోరుబాట...

- సమస్యల పరిష్కారం కోరుతూ ఊపందుకున్న ఉద్యమాలు
- రణభేరికి సిద్ధమైన ఉపాధ్యాయులు
- ఉద్యమ బాటలో విద్యుత్ ఉద్యోగులు
- నిరసన బాటలో సచివాలయ ఉద్యోగులు



కదిరి: ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఉపాధ్యాయ సంఘాలు చేపట్టిన ఉద్యమాలు ఊపందుకున్నాయి. రణభేరి పేరుతో యూటీఎఫ్ ఉద్యమానికి దిగింది. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే ఈ నెల 25న విజయవాడలో పెద్ద ఎత్తున బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో రణభేరీ జాతా పేరుతో జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలు విజయవంతమయ్యాయి. ఏపీటీఎఫ్ సైతం వివిధ రూపాల్లో ఉద్యమాలు సాగిస్తోంది. ఈ నెల 11న నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. 12న మండల కేంద్రాల్లో నిరసనలు, 13, 14వ తేదీల్లో ప్రజా ప్రతినిధులకు వినతులు ఇచ్చారు. 15న డివిజన్ కేంద్రాల్లో, 16న జిల్లా కేంద్రంలో నిరసనలు తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన గళం..

దాదాపు ఏడాదిన్నరగా ఎన్నో వేధింపులను మౌనంగా భరిస్తూ వచ్చిన సచివాలయ ఉద్యోగుల్లో చివరకు సహనం నశించింది. ఈ నేపథ్యంలో తమ ఆత్మ గౌరవాన్ని వదులుకోక తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. ఇంటింటికీ వెళ్లి వాట్సాప్ సేవలపై ప్రచారం చేసే ప్రసక్తే లేదని, అవసరమైతే నిరవధిక సమ్మెకు సిద్ధమని, తమ సమస్యలు పరిష్కరించకపోతే అక్టోబర్ 1 నుంచి పింఛన్ల పంపిణీ ఆపేస్తామంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పోరుబాటలో విద్యుత్ ఉద్యోగులు..

తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో విద్యుత్ ఉద్యోగులు ఉద్యమబాట పట్టారు. ఈ క్రమంలో విద్యుత్ శాఖలోని అన్ని యూనియన్లు ఏకతాటిపైకి వచ్చి జేఏసీగా ఏర్పడ్డాయి. ఈ నెల 15, 16వ తేదీల్లో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. 17, 18వ తేదీల్లో భోజన విరామ సమయాల్లో ఆందోళనలు చేపట్టారు. 19, 20వ తేదీల్లో రిలే నిరాహార దీక్షలు చేయనున్నారు. 22న ర్యాలీగా వెళ్లి కలెక్టర్కు వినతి పత్రం సమర్పించనున్నారు.

సచివాలయ ఉద్యోగుల డిమాండ్లు ఇవే

- విధులకు సంబంధం లేని సర్వేలు, ఇతర పనుల నుంచి విముక్తి కలిగించాలి.
- శాఖల వారీగా మాతృశాఖలో విలీనం చేయాలి.
- సచివాలయాల్లోని అన్ని విభాగాల ఉద్యోగులకు ఒకే బేసిక్తో పదోన్నతి కల్పిస్తూ పీఆర్సీ స్లాబ్ వర్తింపజేయాలి.
- సెలవు రోజుల్లో బలవంతపు విధుల నుంచి విముక్తి కలిగించాలి.
- రికార్డు అసిస్టెంట్ క్యాడర్ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్గా అప్గ్రేడ్ చేయాలి.
- ప్రొబేషన్ కాలానికి గాను నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి.

విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లు కొన్ని..

- నగదు రహిత వైద్యం అందించాలి.
- 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004 ఆగస్టు 31 మధ్య చేరిన ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి.
- పెండింగ్లో ఉన్న 4 డీఏలను తక్షణమే చెల్లించాలి.
- ఇంజనీరింగ్ డిగ్రీ ఉన్న సబ్ ఇంజనీర్లకు ఏఈలుగా పదోన్నతుల్లో అవకాశం కల్పించాలి.
- దళారీ వ్యవస్థను రద్దు చేసి కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించాలి.
- మొత్తం 13 రకాల డిమాండ్లను ప్రభుత్వం ఎదుట ఉంచగా.. ఇందులో కాంట్రాక్టు కార్మికులకు సంబంధించే 6 డిమాండ్లు ఉన్నాయి.

టీచర్ల డిమాండ్లు కొన్ని..

- పెండింగ్లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే చెల్లించాలి.
- సీపీఎస్ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలి
- 12వ పీఆర్సీని నియమించి, ఐఆర్ ప్రకటించాలి.
- అన్ని రకాల బకాయిలను తక్షణం చెల్లించాలి.
- యాప్ల భారంతో పాటు బోధనేతర పనులను ఎత్తివేయాలి.
- ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25లక్షలకు పెంచాలి.

ఉద్యమం తప్పదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటి వరకూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో ఒక్కో డిపార్ట్మెంట్ ఉద్యమానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే పలు శాఖలకు చెందిన ఉద్యోగులు నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం తప్పదు.
– ఎల్.రామమోహన్ చౌదరి, జిల్లా అధ్యక్షుడు, ఏపీ ఎన్జీఓ సంఘం

అన్ని సేవలూ నిలిపేస్తాం



ఈ నెలాఖరులోపు కూటమి ప్రభుత్వం మా డిమాండ్లను నెరవేర్చాలి. లేదంటే అక్టోబర్ 1వ తేదీ నుంచి పింఛన్ల పంపిణీతో పాటు ఇతర అన్ని రకాల సేవలూ నిలిపివేస్తాం.
– శివరాజ్, జిల్లా అధ్యక్షుడు, సచివాలయ ఉద్యోగుల సంఘం

టీచర్ల సత్తా చూపిస్తాం



విద్యాసంస్కరణల పేరుతో టీచర్లను ఇబ్బందులకు గురి చేయడం మంచిది కాదు. పెండింగ్ డీఏలు వెంటనే ఇవ్వాలి. పీఆర్సీ నియమించి ఐఆర్ మంజూరు చేయాలి. ప్రభుత్వం స్పందించకపోతే కూటమి సర్కారుకు టీచర్ల సత్తా ఏమిటో చూపిస్తాం.
– శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, యూటీఎఫ్


భూమిపై హక్కులు కోల్పోవద్దు

- ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి


కరపత్రాలు విడుదల చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఎన్పీకుంట: సోలార్ కంపెనీల మాయలో పడితే భూములపై హక్కులు కోల్పోయే ప్రమాదముందని రైతులను ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.హరి హెచ్చరించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను రైతులతో కలసి ఎన్పీకుంటలోని బస్టాండ్ వద్ద గురువారం ఆయన విడుదల చేసి, మాట్లాడారు. రైతులు, ప్రజల శ్రేయస్సును ప్రభుత్వాలు గాలికి వదిలేసి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని మండిపడ్డారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి పేరుతో గ్రామాలలో సాగు భూములు ఎకరాకు ఏడాదికి రూ.30 వేలు లీజు లేదా, ఎకరా రూ.5.25 లక్షలతో కొనుగోలు చేస్తామంటూ పలు కంపెనీలు ఏజెంట్ల ద్వారా గ్రామాలలో రైతులను ప్రలోభ పెడుతున్నాయన్నారు. ఒక ఎకరా భూమిలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా ఏడాదికి రూ.75లక్షల నుంచి రూ.80 లక్షల వరకు కంపెనీలు ఆదాయం గడిస్తున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో లీజుకు తీసుకునే భూములకు సంబంధించి ఎకరాకు రూ.50 వేలు చెల్లించడంతో పాటు ప్రతి రెండేళ్లకు ఓసారి 20 శాతం లీజు పెంచాలని, అగ్రిమెంట్ కాలపరిమితి పదేళ్లకు మించకుండా ఉండాలని, భూములకు సంబంధించిన జిరాక్స్ డాక్యుమెంట్లు మాత్రమే కంపెనీలు తీసుకోవాలని, భూమి కొనుగోలు విధానంలో 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని, పంటలు పండని భూములకు ఎకరాకు రూ.10లక్షలు, పంటలు పండే భూములకు ఎకరాకు రూ.25 లక్షలు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 24న విజయవాడలో తలపెట్టిన సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు, ప్రధానకార్యదర్శి ఫిరంగి ప్రవీణ్కుమార్, నాగిరెడ్డి, గంగిరెడ్డి, స్వామిరెడ్డి, చిన్న మల్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాడాలి


మాట్లాడుతున్న ఆశావర్కర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

అనంతపురం అర్బన్: హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి సమైక్యంగా ఉద్యమించాలని ఆశావర్కర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు అనుకూల విధానాలను అనుసరిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్లో ఆశావర్కర్ల సంఘం జిల్లా మహాసభలు నిర్వహించారు. సభకు ధనలక్ష్మితో పాటు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు చేపట్టాలన్నారు. ఆశావర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలన్నారు. మెడికల్, క్యాజువల్ లీవులు వర్తింపజేయాలన్నారు. అంతిమసంస్కారాల ఖర్చులకు రూ.20 వేలు ఇవ్వాలన్నారు. జనాభాకు అనుగుణంగా ఆశా కార్మికుల నియామకాలు చేపట్టాలన్నారు. ఇక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మద్దతునిస్తూ ప్రజలపై భారాలు మోపుతోందన్నారు. ప్రభుత్వ స్థలాల్లో పేదలు వేసుకున్న గుడిసెలను రాష్ట్ర ప్రభుత్వం దాడులు చేస్తూ తొలగిస్తోందని మండిపడ్డారు. అదే కార్పొరేట్ సంస్థలకు మాత్రం ఒక్క రూపాయికి ఎకరా చొప్పున వందల ఎకరాలను అప్పగిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, ఉపాధ్యక్షుడు రామాంజినేయులు, ఆశావర్కర్ల సంఘం నాయకురాళ్లు కుళ్లాయమ్మ, రాధమ్మ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

గాత్ర కచేరీతో ఆకట్టుకున్న చిన్నారులు


భక్తిగీతాలు ఆలపిస్తున్న మలేషియా చిన్నారులు

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా మలేషియా నుంచి తరలివచ్చిన సత్యసాయి భక్తులు గురువారం సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. సత్య సాయిపై భక్తిభావనను చాటుతూ ఆ దేశ సత్యసాయి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు నిర్వహించిన గాత్ర కచేరీ ఆకట్టుకుంది. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

స్థూల ఆదాయం పెంపునకు చర్యలు తీసుకోండి

- కలెక్టర్ శ్యామ్ప్రసాద్


మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ప్రసాద్

ప్రశాంతి నిలయం: వ్యవసాయ అనుబంధ శాఖల స్థూల ఆదాయం 15 శాతం పైబడి పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఎ.శ్యామ్ప్రసాద్ ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టు, సూక్ష్మ నీటి పారుదల, పశుసంవర్ధక, మత్స్య, మార్కెటింగ్, సహకార తదితర శాఖల్లో స్థూల ఆదాయం పెంపు అంశంపై గురువారం ఆయా శాఖల అధికారులతో కలెక్టరేట్లో ఆయన సమీక్షించారు. ఉద్యాన శాఖ ద్వారా వివిధ పండ్ల తోటల విస్తీర్ణాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని సూక్ష్మ నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల్లో ఉత్పత్తుల నాణ్యతను పెంచే మార్గాలు అన్వేషించాలన్నారు. నీటి కుంటలు పెంచాలని, కరువును తట్టుకునే పంటలను పరిచయం చేయాలని ఆదేశించారు. టమాట ధరలు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ధరల స్థిరీకరణ మార్గాలు, అందుకు సంబంధించిన కార్యాచరణ అమలు చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారులకు సూచించారు. పశుసంవర్ధక శాఖ వార్షిక ప్రణాళికను సమీక్షించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి రాము నాయక్, సెరికల్చర్ జేడీ శోభారాణి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ఉద్యాన అధికారి చంద్రశేఖర్, మార్కెటింగ్ శాఖ మేనేజర్ గీత, మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఎల్డీఎం రమణకుమార్, కో–ఆపరేటివ్ అధికారి కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై ఉద్యమిస్తాం

- సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య


పెనుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

పెనుకొండ: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని కూటమి ప్రభుత్వాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య హెచ్చరించారు. పెనుకొండలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను గురువారం సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు పరిశీలించారు. అంతకు ముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వేమయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీలకు అనుమతులు తీసుకువచ్చిందని, వీటిలో కొన్ని కాలేజీల నిర్మాణం పూర్తయి తరగతులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. మరి కొన్ని 70 శాతం నిర్మాణాలు పూర్తి అయినట్లు తెలిపారు. వీటిని పీపీపీ పద్ధతిలో నిర్వహించేలా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే నిర్ణయం సరైంది కాదన్నారు. నాబార్డు నిధులతో పనులు ప్రారంభించిన పెనుకొండ మెడికల్ కళాశాలకు ఇప్పటికే రూ.30 కోట్లు ఖర్చయ్యాయని, 50 శాతానికి పైగా పనులు పూర్తికాగా, మిగిలిన పనులు పూర్తి చేయకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఇతర అణగారిన వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే దిశగా కూటమి సర్కారు అడుగులేస్తోందన్నారు. ప్రభుత్వ ఆధీనంలో మెడికల్ కళాశాల ఉంటే అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఉచితంగా అందుతాయన్నారు. అదే ప్రైవేటీకరణ చేయడం ద్వారా జ్వరానికి చికిత్స పొందాలన్నా డబ్బు చెల్లించక తప్పదన్నారు. ఫీజులు సైతం యాజమాన్యాలు ఇష్టానుసారంగా వసూలు చేస్తాయని మండిపడ్డారు. మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని, కాదని ప్రైవేటీకరణ చేస్తే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జయరాజు, రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, సీపీఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు, నాయకులు బాలస్వామి, మల్లికార్జున, నరసింహులు, రమేష్, కిష్టప్ప, విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఐ శేఖర్పై హెచ్ఆర్సీకి ఫిర్యాదు

- టీడీపీ నేత హంపయ్య


మాట్లాడుతున్న హంపయ్య, మహేష్

గోరంట్ల: అధికారాన్ని అడ్డు పెట్టుకుని గోరంట్ల సీఐ బోయ శేఖర్ సాగిస్తున్న అరాచకాలపై మానవ హక్కుల సంఘం (హెచ్ఆర్సీ)కు ఫిర్యాదు చేయనున్నట్లు వెంకటరమణపల్లి మాజీ ఎంపీటీసీ, టీడీపీ నేత హంపయ్య పేర్కొన్నారు. బీజేపీలో కొనసాగుతున్న తన మేనల్లుడు నరేష్ను బుధవారం ఓ కేసు విషయంగా విచారణకు పిలుచుకెళ్లిన సీఐ శేఖర్ థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని ఆయన ఆక్షేపించారు. గురువారం ఆయన గోరంట్లలో నరేష్ సోదరుడు మహేష్తో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నరేష్పై థర్డ్ డిగ్రీ ప్రయోగించడమే కాక పత్రికల్లో రాయలేని పదజాలంతో కుటుంబ సభ్యులనూ దూషించిన సీఐ శేఖర్ తీరుతో బుధవారం సాయంత్రం పోలీస్ స్టేషన్ ఎదుట తన మేనల్లుడు ఆత్మహత్యాయత్నం చేశాడన్నారు. దీనిని పోలీసులు సకాలంలో భగ్నం చేయడంతో అదే రోజు రాత్రి విషపూరిత ద్రావకం తాగాడన్నారు. కుటుంబ సభ్యులు గుర్తించి ఆగమేఘాలపై కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారన్నారు. ప్రస్తుతం కదిరి ఆస్పత్రిలోనే నరేష్ చికిత్స పొందుతున్నాడని పేర్కొన్నారు. వ్యక్తిగత కక్షతో అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్న సీఐ శేఖర్పై పోలీసు ఉన్నతాధికారులతో పాటు హెచ్ఆర్సీకి ఫిర్యాదు చేయడంతో పాటు ప్రైవేట్ కేసు దాఖలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

మహేష్ మాట్లాడుతూ... 2014లో రాజకీయ కారణాలతో తన సోదరుడు నరేష్ తో పాటు తనపై కూడా పోలీసులు రౌడీషీట్ తెరిచారని గుర్తు చేశారు. తమపై రౌడీషీట్ ఉన్నా సత్ప్రవర్తనతోనే మెలుగుతూ వచ్చామన్నారు. ఈ 11 ఏళ్లలో తమపై ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్నారు. కేవలం రౌడీషీట్ ఉందనే కారణంతో తమను సీఐ శేఖర్ బుధవారం పీఎస్కు పిలిపించుకుని నరేష్ను నానా చిత్రహింసలకు గురి చేశారన్నారు. రెండు నెలల క్రితం గోరంట్ల బస్టాండ్ సమీపంలో ఆర్అండ్బీ ప్రహరీ కూల్చివేతలో తన ప్రమేయం లేకపోయినా స్టేషన్కు పిలిపించుకుని దుర్భాషలాడారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ శేఖర్ తీరుతో పోలీసు వ్యవస్థ ప్రతిష్ట మంట కలుస్తోందని, అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జూదరుల అరెస్ట్

బత్తలపల్లి: మండలంలోని రామాపురం సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి, రూ.8,260 నగదు స్వాధీనం చేసుకున్నట్లు బత్తలపల్లి పీఎస్ ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. అందిన సమాచారం మేరకు గురువారం ఆ గ్రామ సమీపంలోని చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో తనిఖీలు చేపట్టామన్నారు. ఆ సమయంలో నది ఒడ్డున పేకాట ఆడుతూ జూదరులు పట్టుబడ్డారన్నారు.

- **హిందూపురం:** మండలంలోని మనేసముద్రం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి, రూ.15,080 నగదు, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు హిందూపురం రూరల్ పీఎస్ సీఐ ఆంజినేయులు తెలిపారు. అందిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టి జూదరులను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

డీఎస్సీ అభ్యర్థి ఆత్మహత్య


వెంకటేష్ (ఫైల్)

పరిగి: డీఎస్సీ – 2025లో ఉద్యోగం రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ అభ్యర్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పరిగి మండలం కొడిగెనహళ్లి గ్రామానికి చెందిన వెంకటేశ్(37)కు భార్య లీలావతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బీఈడ్ పూర్తి చేసి, ఉద్యోగం రాకపోవడంతో వ్యవసాయ కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నేపథ్యంలో ఇటీవల డీఎస్సీ పరీక్షకూ హాజరయ్యాడు. అయితే ఎంపిక జాబితాలో పేరు లేకపోవడంతో జీవితంపై విరక్తితో గురువారం ఉదయం స్థానిక ఓ ప్రైవేట్ కళాశాల వెనుక ఉన్న రేకుల షెడ్డులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో మృతుడి కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వేధింపుల కేసు నమోదు

ధర్మవరం అర్బన్: వివాహిత ఫిర్యాదు మేరకు ఆమె భర్త, అత్త, మామపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ధర్మవరం రెండో పట్టణ సీఐ రెడ్డప్ప తెలిపారు. వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. ధర్మవరంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన సయ్యద్ షాహీనా, బాబా ఫకృద్దీన్ దంపతులు. ఓ ప్రైవేట్ బ్యాంక్ ఉద్యోగిగా పనిచేస్తున్న బాబా ఫకృద్దీన్ మరో మహిళతో వివాహేతర సంబంధం ఏర్పాటు చేసుకుని షాహీనాను వేధింపులకు గురి చేస్తూ వచ్చాడు. విషయాన్ని అత్త షంషాద్, మామ మదార్ వలి దృష్టికి తీసుకెళ్లడంతో వారు సైతం బాబా ఫకృద్దీన్కే వత్తాసు పలుకుతూ షాహీనాను శారీరకంగా, మానసికంగా హింసలకు గురి చేశారు. దీంతో బాధితురాలు చేసిన ఫిర్యాదు మేరకు భర్త, అత్త, మామపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బండరాళ్లు మీదపడి యువకుడి మృతి


మృతదేహాన్ని వెలికి తీస్తున్న దృశ్యం

తనకల్లు: స్థానిక భారత్ పెట్రోల్ బంకు సమీపంలోని నల్లగుట్టలో గురువారం బండరాళ్లు మీదపడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తనకల్లులోని సంజీవయ్య నగర్కు చెందిన ఇండ్ల చంద్ర (32)కు భార్య కావ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో స్థానిక సర్వే నంబర్ 793లో ఇంటి పట్టా ఇప్పిస్తామని సీపీఎం, రైతు సంఘం నాయకులు శివన్న, రమణ, ఒంటిద్దు వేమన్న, వెంకటరమణ చెప్పడంతో అక్కడ స్థలాన్ని చూసేందుకు గురువారం ఇండ్ల చంద్ర నల్లగుట్ట వద్దకు వెళ్లాడు. అదే సమయంలో గుట్టలో కొందరు జేసీబీ సాయంతో రాళ్లను తొలగించి భూమిని చదును చేస్తుండడంతో చంద్ర కూడా అక్కడే ఉన్నాడు. ఈ క్రమంలో గుట్టపై ఉన్న రాళ్లు కదలి ఒక్కసారిగా మీద పడడంతో చంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి, రూరల్ పీఎస్ సీఐ నాగేంద్ర, స్థానిక ఎస్ఐ గోపి అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. జేసీబీ సాయంతో బండ రాళ్లను తొలగించి మృతదేహాన్ని వెలికి తీయించారు. భార్య కావ్య చేసిన ఫిర్యాదు మేరకు జేసీబీ డ్రైవర్ షెక్షావలి, సీపీఎం, రైతు సంఘం నాయకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైల్వేలో క్యూఆర్ కోడ్తో జనరల్ టిక్కెట్ల విక్రయాలు


ఉద్యోగి ధరించిన జాకెట్ వెనుక ఉన్న క్యూర్ కోడ్ను స్కాన్ చేసి, టిక్కెట్ పొందుతున్న యువకుడు

గుంతకల్లు: దసరా, దీపావళి పండుగల రద్దీ దృష్ట్యా రైల్వేలో జనరల్ టిక్కెట్లు (అన్ రిజర్వ్) కొనుగోలును మరింత సులభతరం చేయడానికి క్యూఆర్ కోడ్ను అందుబాటులోకి తెచ్చినట్లు సీనియర్ డీసీఎం మనోజ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గుంతకల్లు రైల్వేస్టేషన్లో రెట్రో రిఫ్లెక్టివ్ జాకెట్లపై క్యూర్ కోడ్ను ముద్రించారు. ఈ జాకెట్లను సంబంధిత విభాగపు సిబ్బంది ధరించేలా చేశారు. జాకెట్ వెనుక భాగంలో ఉన్న క్యూ ఆర్ కోడ్ను యూటీఎస్ మొబైల్ యాప్ ద్వారా స్కాన్ చేసి టిక్కెట్ను పొందే వెసులుబాటు కల్పించారు. అన్రిజర్వ్డ్, ప్లాట్ఫారం టిక్కెట్లు కొనుగోలు చేసే సమయంలో ఎక్స్ప్రెస్ రైళ్ల వివరాలను తెలుసుకునేలా సిబ్బంది సహకరిస్తారు. అంతేకాక టిక్కెట్ కొనుగోలు చేసినప్పుడు 3 శాతం బోనస్ క్రెడిట్ అవుతుంది. ప్రస్తుతం డివిజన్లో ఎక్కువగా రద్దీ ఉండే తిరుపతి, గుంతకల్లు రైల్వే జంక్షన్లలో ఈ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు.